కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



నంద్యాల క్రైం, జూలై 18: నంద్యాల ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అధిరాజ్ సింగ్ రాణా గురువారం కలెక్టర్ జి.రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలోని పరిస్థితులపై ఇరువురు చర్చించుకున్నారు.



- సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి
- తాగునీటి పథకాల బకాయిలు ఇప్పించాలి
- అస్తవ్యస్తంగా గ్రామీణ రహదారులు
- కర్నూల్లో కృష్ణా బోర్డు ఏర్పాటుపై చర్చించాలి
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
- టీడీపీ ప్రభుత్వం కొలువుదీరాక తొలి సమావేశం
- హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ప్రగతి పథంలో సాగేనా..?


కర్నూలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు దాటింది. తొలిసారిగా జిల్లా పరిషత్ (జడ్పీ) సర్వసభ్య సమావేశం శుక్రవారం జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి సహా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు వ్యవసాయం, గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్యం, నీటిపారుదల, విద్యుత్ శాఖల పనితీరుపై సమీక్షించనున్నారు. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో గ్రామీణ అభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. సాగునీటి ప్రాజెక్టులు పడకేశాయి. ఉన్న ప్రాజెక్టులకు నిర్వహణ నిధులు ఇవ్వలేదు. వ్యవసాయం రంగానికి జీవంపోయాలి. గ్రామీణ రోడ్లు, తాగునీటి పథకాలు ఆధునికీకరించాలి. విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలి.. ఇలా ఎన్నో సమస్యలు ఉమ్మడి జిల్లా ప్రజలను వేధిస్తున్నాయి. అదే క్రమంలో కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటుపై తీర్మానం చేయాల్సిన అవసరం ఉంది. టీడీపీ కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి జడ్పీ సమావేశంలో ప్రగతి పథంలో అడుగులు పడేలా ప్రజా ప్రతినిధులు చర్చలు.. తీర్మానాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

రైతుకు భరోసా కల్పించాలి

ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 6.38 లక్షల హెక్టార్లు. రబీలో 5.55 లక్షల హెక్టార్లు ఉంటుందని అంచనా. ప్రధాన పంటలు పత్తి, వేరుశనగ, టమోటా, ఉల్లి, మొక్కజొన్న, వరి ధాన్యం సాగు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయం రంగం నిర్వీర్యమైంది. పల్లెపల్లెన రైతు భరోసా కేంద్రాలు తెరిచారే తప్ప.. రైతు సంక్షేమం గాలికి వదిలేశారు. గతేడాది రబీ ఇన్‌పుట్ సబ్సిడీ రూ.98 కోట్లు రైతులకు అందని ద్రాక్షగా మారింది. ఖరీఫ్ పంట బీమా అందలేదు. కరువు పల్లెసీమకు కీలకమైన డ్రిప్ ఇరిగేషన్‌కు గాలికొదిలేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేపడితే.. వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతు గ్రూపులు ఏర్పాటు చేసి వైసీపీ నాయకులకు రూ.15-25 లక్షల వరకు ట్రాక్టర్లు వంటి వ్యవసాయ యంత్రాలు ఇచ్చారు. సామాన్య రైతులకు తీరని అన్యాయం చేశారు. నకిలీ, నాసికరం విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. రైతులకు డ్రిప్, వ్యవసాయ యంత్రీకరణ, నాణ్యమైన విత్తనాలు, అన్నదాత పథకం ద్వారా రైతుకు రూ.20 వేలు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో అదేలా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.









వ్యవసాయ కనెక్షన్లకు నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు నెలలుగా నిరీక్షిస్తున్నారు. రెండు జిల్లాల్లో 15.29 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో వ్యవసాయ కనెక్షన్లు 2.13 లక్షలు ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ కోసం గత ఆగస్టు నుంచి దాదాపు 9 వేల మంది రైతులు దరఖాస్తులు చేసి నిరీక్షిస్తున్నారు. రైతులు ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారు. వీటికి 2 వేలు ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు కోసం రైతుల నుంచి బ్యాంక్ ఖాతా, డెబిట్ మ్యాన్‌డెట్ ఫారాలు తీసుకున్నారు. రైతులు మీటర్లు వద్దు అంటున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆత్మకూరులో విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. గత ప్రభుత్వంలో సబ్ స్టేషన్ల నిర్వహణ పేరిట వైసీపీ నాయకుల సిఫారసు మేరకు ఇష్టారాజ్యంగా సిబ్బందిని తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



అసంపూర్తిగా ఆర్‌డీఎస్ కాలువ హెడ్ వర్క్ స్లూయిస్

తాగునీటి బకాయిలు ఇప్పించాలి

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గ్రామీణ తాగునీరు సరఫరా, పారిశుధ్యం శాఖ పర్యవేక్షణలో 60 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకాలు ఉన్నాయి. వాటి ద్వారా సుమారుగా 950 గ్రామాలకు శుద్ధి చేసిన (ఫిల్టర్) తాగునీరు అందిస్తున్నారు. వీటి నిర్వహణ కోసం ప్రభుత్వం ఓ అండ్ ఎం గ్రాంట్ కింద ఏటేటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ కోసం రూ.85.71 కోట్లు జిల్లా పరిషత్ (జడ్పీ) అధికారులు పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఆ నిధులతో విద్యుత్ బిల్లులు కోసం రూ.40.88 కోట్లు, స్కీంల నిర్వహణ, తాత్కాలిక మరమ్మతులు, సిబ్బంది జీతాలు కోసం రూ.44.83 కోట్లు కేటాయించారు. పలు స్కీంలకు 15 నెలలు, కొన్ని స్కీంలకు 24 నెలలు నుంచి ఓ అండ్ ఎం నిధులు అందడం లేదు. ఆదోని, ఆస్పరి, ఆలూరు మండలాల్లో పలు గ్రామాలకు తాగునీరు అందించే ఆస్పరి సీపీడబ్ల్యూఎస్ స్కీం కాంట్రాక్టరుకు మూడేళ్లుగా ఓ అండ్ ఎం నిధులు ఇవ్వలేదు. నిధులు ఇవ్వకపోవడం వల్ల సిబ్బందికి జీతాలు అందడం లేదు. నిధులు లేక ఆయా స్కీంలు బంద్ అయితే తాగునీటి కోసం పల్లెజనం తల్లడిల్లాల్సి వస్తుంది.

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

రాష్ట్ర విభజన అనంతరం ఏర్పాటైన చంద్రబాబు ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. రాయలసీమ జల జీవనాడి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, కడప జిల్లాకు కృష్ణా జలాలు పంపించే అవుకు బైపాస్ టన్నెల్ టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. పశ్చిమ ప్రాంతం కరువు, వలసలు నివారించే లక్ష్యంగా 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ రైట్ బ్యాంక్ కెనాల్‌కు శ్రీకారం చుట్టింది. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని రూ.1,942.38 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరిలో జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేసింది. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగు, పలు గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ అదే ఏడాది జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76 జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ప్రాజెక్టులు అటకెక్కాయి. సీమకు జీవనాడి తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మాణం కోసం 2019 ఫిబ్రవరి 21న అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం రూ.2,890 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీఓ నం.154 జారీ చేశారు. వైసీపీ వచ్చాక అంతరాష్ట్ర సమస్య అంటూ ఆ ఫైల్‌ను పట్టించుకోలేదు. కేవలం రూ.150 కోట్లు ఇస్తే హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద 65 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా ఒక్కపైసా ఇవ్వలేదు. శ్రీశైలం ప్రాజెక్టు, వెలుగోడు జలాశయం మరమ్మతులకు డ్రిప్-2 కింద కేంద్రానికి ప్రతిపాదనలు పంపినా గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో నిధులు కాలేదు. రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరిట రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు చేపట్టి తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూశారే తప్పా ఆ ప్రాజెక్టు ఎక్కడికక్కడే ఆగిపోయింది. తెలుగుగంగ, ఎస్సార్బీసీ కాలువ ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

● కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర విభజన తరువాత కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్‌లో, గోదావరి నదీయాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తెలంగాణలో ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉంది. కృష్ణా నది, ఆ నదిపై నిర్మించిన ప్రాజెక్టులు రెండు రాష్ట్రాల ప్రాజెక్టులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో దగ్గరలోనే ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కృష్ణా డెల్టాకు ఇవ్వాల్సిన కృష్ణా జలాలు కూడా శ్రీశైలంలో నిల్వ చేసిన సీమ ప్రాజెక్టులకు మళ్లించే అవకాశం ఉంది. పాలన పరమైన నిర్ణయాలు, నీటి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని పదేళ్లుగా రైతులు కోరుతున్నారు. గత వైపీపీ సర్కారు కృష్ణా నది, ప్రాజెక్టులకు ఏ మాత్రం సంబంధం లేని విశాఖలో ఏర్పాటు చేసింది. ఈ బోర్డు కర్నూలులో ఏర్పాటు చేసేలా జడ్పీలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలి. చంద్రబాబును ఒప్పించాల్సిన బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలుపై ఎంతో ఉంది.



ఆస్పరి రక్షిత మంచినీటి పథకం ఎస్ఎస్ ట్యాంక్

నేడు డీఐజీగా కోయ ప్రవీణ్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు, జూలై 18: కర్నూలు రేంజ్ డీఐజీగా డాక్టర్ కోయ ప్రవీణ్ శుక్రవారం బాధ్యతలు తీసుకోను న్నారు. విశాఖపట్నం గ్రేహౌండ్స్ డీఐజీగా పని చేస్తున్న ఈయన ఇటీవల జరిగిన బదిలీల్లో కర్నూలు రేంజ్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆయన కర్నూలుకు చేరుకున్నారు. స్థానిక పోలీసు అతిథిగృహం చేరుకున్న ఆయనకు ప్రస్తుత డీఐజీతో పాటు కర్నూలు, నంద్యాల ఎస్పీలు, డీఎస్పీలు స్వాగతం పలికారు. ప్రస్తుత డీఐజీ విజయరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. బదిలీపై వెళ్తున్న విజయరావుకు గురువారం రాత్రి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల ఎస్పీలతో పాటు పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఈ సభలో పాల్గొన్నారు.



డాక్టర్ కోయ ప్రవీణ్

తుంగభద్రకు లక్ష క్యూసెక్కుల వరద

- 46.8 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- శ్రీశైలం నుంచి సాగర్‌కు 20,506 క్యూసెక్కులు



తుంగభద్ర జలాశయానికి చేరిన వరద

కర్నూలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. కరువు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తుంగభద్ర గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. గురువారం నీటి లెక్కలు కొలిచే సమయానికి 1614.31 అడుగుల వద్ద 46.80 టీఎంసీలు వరద చేరింది. డ్యాం ఎగువన కురుస్తున్న వర్షాలకు ఉదయం 82,491 క్యూసెక్కుల వరద నమోదైంది. సాయంత్రం 6 గంటలకు వరద లక్ష క్యూసెక్కులు దాటిందని టీబీపీ బోర్డు అధికారులు తెలిపారు. వరద ఆశాజనకంగా ఉండటంతో కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని ఎల్లెల్సీ, హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు ఉత్సాహంగా ఉన్నారు. ఎల్లెల్సీ కింద ఖరీఫ్, రబీ కలిపి 1.51 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంటే.. ఖరీఫ్‌లో 45,450 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. బుధవారం తాగునీటి కోసం 300 క్యూసెక్కులు ఎల్లెల్సీకి విడుదల చేశారు. డ్యాంకు లక్ష క్యూసెక్కుల వరద నమోదు కావడంతో తక్షణమే ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద అడుగులు ఇప్పుడిప్పుడే పడుతున్నాయి. గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 806.80 అడుగుల వద్ద 32.46 టీఎంసీలు నిల్వ ఉంది. ఎగువ నుంచి జలాశయంలోకి 14,700 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. తెలంగాణ, కృష్ణా డెల్టా ప్రాంతాల తాగునీటి అసరాల కోసం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇచ్చిన ఇండెంట్ మేరకు శ్రీశైలం నుంచి 9 టీఎంసీలు తీసుకోవడానికి కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చింది. దీంతో ఏపీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ద్వారా 7,888 క్యూసెక్కులు, ఏపీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ద్వారా 12,618 క్యూసెక్కులు కలిపి 20,506 క్యూసెక్కులు దిగువన నాగార్జున సాగర్‌కు విడుదలు చేస్తున్నారు. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 20,079 క్యూసెక్కులు దిగువన శ్రీశైలానికి వదులుతున్నారు. అయితే.. శ్రీశైలానికి చేరుతున్న వరద 14,700 క్యూసెక్కులు కాగా.. విద్యుత్తు ఉత్పత్తి ద్వారా సాగర్‌కు వదులుతున్న నీరు 20,506 క్యూసెక్కులు. అయితే పై నుంచి వస్తున్న వరద కంటే దిగువకు ఎక్కువగా వదిలేసి జలాశయాన్ని ఖాళీ చేస్తుండడంతో సీమ రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

గడివేముల, జూలై 18: విద్యుత్ టవర్‌ల నిర్మాణం కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ భూములకు తక్కువ పరిహారం ఇస్తుందని మండలంలోని బూజనూరు, గ్రంధివేముల, చిందుకూరు గ్రామాల రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి భూములను పరిశీలించారు. అనంతరం ఆయన పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ అధికారులతో, రైతులతో సమావేశమ య్యారు. విద్యుత్ టవర్ల ఏర్పాటుకు పవర్ గ్రిడ్ సంస్థ సేకరిస్తున్న భూమా రహదారికి సమీపంలో ఉండటంతో మార్కెట్‌లో అధిక ధర ఉందని రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీవో రైతులు తెలిపిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని తెలిపారు. తహసీల్దార్ జమానుల్లాఖాన్, ఆర్ఐ ఎల్లా సుబ్బయ్య, మండల సర్వేయర్ శివప్రసాద్, వీఆర్వోలు, పవర్ గ్రిడ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

'రాయితీపై కందిపప్పు'

నంద్యాల రూరల్, జూలై 18: పౌరసరఫరశాఖ ఆధ్వర్యంలో రాయితీపై కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్నట్టు జిల్లా వాణిజ్య, మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రెహమాన్ గురువారం తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని రైతుబజార్, టెక్కె రైతుబజార్‌లో కందిపప్పు కేజీ రూ.160, సోనామసూరి స్టీమ్డ్ బియ్యం కేజీ రూ.49, పచ్చి బీపీటీ సోనామసూరి కేజీ రూ.48 రాయితీపై విక్రయిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుడికి ఆధార్ కార్డుపై 5 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ముచ్చుమర్రి ఎస్ఐగా గంగయ్య

పగిడ్యాల, జూలై 18: ముచ్చుమర్రి ఎస్ఐగా గంగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి అనే బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన కేసులో నందికొట్కూరు రూరల్ సీఐ విజయ భాస్కర్, ఎస్ఐ జయశేఖర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో డీఐజీ విజయరావు వారిని సస్పెండ్ చేశారు. శ్రీశైలం టూటౌన్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గంగయ్యను ముచ్చుమర్రి స్టేషన్ ఎస్ఐగా ఉన్నతాధికారులు నియమించారు. ఎస్ఐ మాట్లాడుతూ ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతి మృతదేహం కోసం గురువారం కృష్ణానదిలో గురువారం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గంగయ్య తెలిపారు.

విధుల్లో అలసత్వం తగదు: కలెక్టర్

బండిఆత్మకూరు, జూలై 18: ప్రభుత్వ ఉద్యోగులకు తమ విధుల్లో అలసత్వం తగదని కలెక్టర్ రాజకుమారి సూచించారు. గురువారం బండి ఆత్మకూరులోని కేజీబీవీ, ప్రభుత్వ ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేజీబీవీలో గత ఏడాది ఫలితాలు పునరావృతం కాకుండా పనితీరు మెరుగుపరుచుకోవాలని ఎస్‌వో దాక్షాయిణికి సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల, కాన్పుల వార్డు, ల్యాబరేటరీ, మందులగది పరిశీలించారు. మందుల నిల్వ ఉండటం పట్ల కలెక్టర్ ఎందుకు మందులు ప్రజలకు అందించలేక పోయారని డాక్టర్ సవితను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డుల నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు వీధుల్లో మురుగు నిలిచి ఉండటం పట్ల ఏవో హనీఫ్‌ఖాన్‌ను కలెక్టర్ మందలించారు. రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.



పీహెచ్‌సీలో వ్యాధిగ్రస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నేడు వాసంతి కుటుంబాన్ని పరామర్శించనున్న మంత్రులు



అప్రోచ్ కాలువలో గాలింపు చర్యలు చేపడుతున్న ఏపీఎస్‌డీఆర్ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు

నందికొట్కూరు, జూలై 18: అత్యాచారానికి గురై, హత్య గావించబడ్డ బాలిక వాసంతి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు నేడు రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎం డీ ఫరూక్ ముచ్చుమర్రి గ్రామానికి రానున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు మం త్రులు ముచ్చుమర్రికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రభుత్వం ప్రకటిం చిన రూ.10 లక్షల పరిహారం చెక్కును అందజేస్తారు. వీరితో పాటు నంద్యాల ఎంపీ బైరెడ్డి డా. శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, కలెక్టర్ రాజకుమారి రానున్నారు. గురువారం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి ఉన్న అప్రోచ్ కాలువలో, కృష్ణానదిలో ఏపీఎస్‌డీఆర్ఎఫ్, ఎన్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు వాసంతి మృతదేహం కోసం గాలించారు.

ఎస్జీటీ అభ్యర్థులకు వరం

- బీసీ స్టడీ సర్కిల్‌లో 200 మందికి ఉచితంగా డీఎస్సీ కోచింగ్
- శిక్షణతో పాటు స్టైఫండ్, మెటీరియల్ ఉచితం



కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 18: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌జీటీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. దీంతో బడుగు, బలహీన వర్గాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ వరంగా మారింది. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులను నోటిఫికేషన్‌లో ప్రకటించారు. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే బడుగు, బలహీన వర్గాల నిరుద్యోగులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్‌ను అందిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ సెంటరులో 200 మందికి ఉచితంగా డీఎస్సీకి కోచింగ్ ఇవ్వనున్నారు. ఇందులో బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం ప్రకారం సీట్లను కేటాయించి కోచింగ్ ఇవ్వనున్నారు. రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలగకుండా ఇప్పుడు కేటాయించిన సీట్లకు అదనంగా పది శాతం పెంచి ఈడబ్ల్యూఎస్ కోటా కింద వర్తింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. డీఎస్సీ (ఎస్‌జీటీ) పోస్టులకు మాత్రమే బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్‌ను అందించనున్నారు. టీడీపీ పాలనలో బీసీ స్టడీ సర్కిల్‌లో వీఆర్వో, వీఆర్‌ఏ, పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు, డీఎస్సీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వడం ద్వారా పేద, మధ్య తరగతి నిరుద్యోగులకు కొంత ఊరట కలిగేది. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీ స్టడీ సర్కిల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ సౌకర్యం పొందే అవకాశం లేకపోవడంతో ముఖ్యంగా గ్రామీణ పేద కుటుంబాల నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు కోచింగ్‌లకు వెళ్లి వేలకు వేలకు ఫీజులుచెల్లించే స్థోమత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల నోటిఫికేషన్‌కు యువత ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోనూ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇప్పించడంలో సీఎం చంద్రబాబుకు ఎవరూ సరిలేరని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణతో పాటు స్టైఫండ్, మెటీరియల్ పంపిణీ

బీసీ స్టడీ సర్కిల్ కేంద్రంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ పొందే అభ్యర్థులకు ప్రభుత్వం ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌తో పాటు రెండు నెలల శిక్షణా కాలంలో స్టైఫండ్‌ను అందిస్తోంది. నెలకు ఒక్కో అభ్యర్థికి రూ.1,500 చొప్పున రెండు నెలలకు రూ.3 వేలు ప్రభుత్వం అందిస్తుంది. వెయ్యి రూపాయలు విలువ చేసే మెటీరియల్ కూడా అందిస్తారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు కల్లూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఇవ్వనున్నారు.

ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో ఫీజుల దోపిడీ

ప్రైవేటు కోచింగ్ కేంద్రాల్లో డీఎస్సీ, టెట్ పరీక్షలకు కోచింగ్‌లో శిక్షణ పొందాలంటే ఒక్కొక్క నిరుద్యోగ అభ్యర్థి నుంచి రూ.18 నుంచి 20వేల వరకు కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు ఫీజులను వసూలు చేస్తున్నారు. బడుగు బలహీన వర్గాల కుటుంబాల నిరుద్యోగులు ఫీజులు చెల్లించే స్థోమత లేక ఇంటి దగ్గరే ఉండి.. టెట్, డీఎస్సీ పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ అవుతున్నారు. చాలా మంది నిరుద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలను వదులుకుని ఇంటి దగ్గరే ఉండి పూర్తి సమయాన్ని కేటాయిస్తున్నారు. ఉద్యోగంతో పాటు అరకొర జీతాన్ని వదులుకుని ఫీజు చెల్లించి కోచింగ్ తీసుకోలేని నిరుద్యోగులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ శిక్షణా తరగతులు కొండంత బలాన్ని ఇస్తుంది. బీసీ స్టడీ సర్కిల్ కేంద్రాల్లో ఉచిత కోచింగ్ టానిక్‌లా పని చేస్తుందని నిరుద్యోగులు అంటున్నారు. ఇది సువర్ణ అవకాశం అని నిరుద్యోగ యువత ఆనందాన్ని వెల్లువిరుస్తోంది.



టీటీసీ ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో వచ్చిన మార్కుల మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. శిక్షణా కాలం 60 రోజులు ఉంటుంది. ఒక్కో అభ్యర్థికి ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌తో పాటు నెలకు రూ.1,500 చొప్పున రెండు నెలల పాటు రూ.3 వేలు స్టైఫండ్ ఇస్తారు. - వెంకటలక్ష్మమ్మ, డీబీసీడబ్ల్యూవో, బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి, కర్నూలు

మంత్రి బీసీని కలిసిన ఎస్పీ



మంత్రి బీసీకి మొక్క అందజేస్తున్న ఎస్పీ

బనగానపల్లె, జూలై 18: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అధిరాజ్‌సింగ్ రాణా రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని గురువారం టీడీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బీసీ జనార్దన్‌రెడ్డికి ఎస్పీ పూలమొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతల విషయమై ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, ఆయన సోదరులు బీసీ రామనాథరెడ్డి, తనయుడు బీసీ మౌర్యనాథరెడ్డి ఉన్నారు.

నంద్యాల క్రైం, జూలై 18: జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను గురువారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆళ్లగడ్డలో శాంతిభద్రతల పర్యవేక్షణపై చర్చించారు.



నల్లమల్లలో ఇద్దరు వేటగాళ్ల అరెస్టు


- నాటు తుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు



పట్టుబడిన వేటగాళ్ళతో ఫారెస్టు అధికారులు

రుద్రవరం, జూలై 18: నల్లమలలో వన్య ప్రాణి వేటగాళ్ళు సంచరిస్తున్నట్లు సమచారం అందడంతో డిప్యూటీ రేంజర్ మూర్తుజావలి దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు రేంజర్ శ్రీపతి నాయుడు గురువారం తెలిపారు. సవరం పిచ్చయ్య, సవరం వీరయ్య అనే ఇద్దరి నుంచి ఒక నాటు తుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరు నల్లమల్ల అడవిలోని పావన నరసింహ స్వామి దేవాలయం సమీపంలో వన్యప్రాణులను వేటాడేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని కోవెలకుంట్ల కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఆగస్టు 1వ తేది వరకు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ దాడిలో మొబైల్ పార్టీ డిప్యూటీ రేంజర్ నాగేంద్ర నాయక్, బీట్ ఆఫీసర్లు విజయవర్ధన్, నాగ ఉసేనయ్య పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి 25,174 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యామ్

శ్రీశైలం, జూలై 18: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి గురువారం ఇన్‌ఫ్లో నమోదైంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 25,174 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 806.60 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 32.3781 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 7,064 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వర్శిటీలకు ఇన్‌చార్జి ఉపకులపతుల నియామకం



ఉపకులపతిగా బాధ్యతలు తీసుకున్న ఎన్‌టీకే నాయక్

కర్నూలు(అర్బన్), జూలై 18: జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు ఇన్‌చార్జి ఉపకులపతులను నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు రాయలసీమ యూనివర్సిటీకి అక్కడ రెక్టార్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను, యోగివేమన యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ పఠాన్ షేక్ షావలీ ఖాన్‌ను డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి ఇన్‌చార్జి ఉపకులపతులుగా నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ జీవో జారీ చేశారు. గతంలో రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా పనిచేసిన సుధీర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఫజలూర్ రహమాన్ రాజీనామా చేయడంతో వారి స్థానంలో వీరిని నియమించారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతిగా ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ బాధ్యతలు తీసుకున్నారు. రిజిస్ట్రార్ ఎన్ వెంకటేశ్వర్లు, డీన్‌లు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, వర్సిటీలోని వివిధ విభాగాల ఆధ్యాపకులు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

20న నిరుద్యోగులకు జాబ్ మేళా

కర్నూలు(అర్బన్), జూలై 18: సీ. క్యాంప్ జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిరుద్యోగులకు ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి పీ. దీప్తి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు నవతారోడ్డు ట్రాన్స్‌పోర్టు, సంగీత మొబైల్స్, ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ కంపెల ప్రతినిధులు హాజరవుతారని, పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్ లాంటి విద్యార్హతలను బట్టి ఎంపికైన వారికి నెలకు రూ. 10,820 నుంచి 16,000 వరకు జీతం ఇస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు.

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు

కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



నిత్యావసర వస్తువుల పంపిణీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, జూలై 18 : బనగానపల్లె పట్టణంలో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు సరఫరా కేంద్రం ప్రత్యేక కౌంటర్‌ను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. బనగానపల్లె పట్టణంలోని శాఖా గ్రంథాలయం పక్కన ఉన్న గ్రామ పంచాయతీ రూమ్ నంబరు 1లో హోల్ సేల్ వ్యాపారులు, రైస్ మిల్లుల వ్యాపారుల సహకారంతో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 9 నియోజకవర్గ కేంద్రాల్లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. బనగానపల్లె పట్టణంలో తొలి కౌంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. రైతు బజార్లకు సమాంతరంగా వీటిని తీర్చిదిద్దుతామన్నారు. సరసమైన ధరలకు పేద, మధ్య తరగతి ప్రజలకు బియ్యం, కందిపప్పు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, తహసీల్దారు రవీంద్రారెడ్డి, పౌర సరఫరా శాఖ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు బురానుద్దీన్, టంగుటూరు శ్రీనయ్య, టీఎన్‌ఆర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయాధికారికి పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు(లీగల్), జూలై 18: కర్నూలు జిల్లా నూతన ఎస్పీ జి. బిందు మాధవ్ గురువారం జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం అందించేలా తమ శాఖ కృషి చేస్తుందని తెలిపారు.

బెంగళూరుకు అత్యాధునిక స్టార్ లైనర్ బస్సు

కర్నూలు(రూరల్), జూలై 18: కర్నూలు నుంచి బెంగళూరుకు అత్యాధునిక స్టార్ లైనర్ బస్సు(నాన్ ఏసీ, స్లీపర్)ను నడుపుతున్నట్లు కర్నూలు-1డిపో మేనేజర్ కె. సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సును గురువారం నుంచే ప్రారంభించామని ఆమె తెలిపారు. కర్నూలులో రాత్రి 10గంటలకు బయలుదేరి బెంగళూరుకు ఉదయం 05.15గంటలకు చేరుకుంటుందన్నారు. అదేవిధంగా బెంగళూరులో రాత్రి 10గంటలకు బయలుదేరి కర్నూలుకు ఉదయం 05.15గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఒక కింది బెర్తు రూ.920, పై బెర్తు రూ.850 చార్జీ ఉంటుందని తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలలకు సీట్ల కేటాయింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 18: ఇంజనీ రింగ్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన ఆన్‌లైన్ ప్రక్రియ మొదటి విడత సీట్ల కేటాయింపు జరిగింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు జూలై 1వ తేదీన ప్రారంభమైంది. అయితే మధ్యలో కొంత ఆటంకం జరిగినప్పటికీ షెడ్యూల్ ప్రకారమే విద్యార్థులకు కళాశాలలో సీట్ల కేటాయింపు జరి గింది. కళాశాలలకు సీట్లు కేటాయిం చిన విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు రిపోర్టు చేసుకోవాల్సి ఉంది. ఆయా కళాశాలల్లో రిపోర్టు చేసుకోకపోతే విద్యార్థులు సీట్లను కోల్పో తారు. షెడ్యూల్ ప్రకారం రెండో విడత ప్రవేశాల ప్రక్రియ కొనసా గుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాయలసీమ యూనివర్సిటీతో పాటు మొత్తం 12 ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద అన్ని బ్రాంచుల్లో మొత్తం 7,164 సీట్లు ఉన్నాయి. ఇందులో 6,159 సీట్లు మాత్రమే భర్తీ కాగా, ఇంకా 1005 సీట్లు భర్తీ కాలేదు. నాలుగు కళాశాలల్లో 98 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా ఒక కళాశాలలో 93 శాతం సీట్లు భర్తీ కాగా, మిగతా కళాశాలల్లో అంతంత మాత్రంగానే సీట్లు భర్తీ అయ్యాయి. రాయలసీమ యూనివర్సిటీలో ప్రవేశాలు అంతంతే.. కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో అంతంత మాత్రంగానే ప్రవేశాలు ఉండగా.. కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లోనూ కన్వీనర్ కోటా కింద సీట్లు భర్తీ కాలేదు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉచితంగా సీట్లు పొందే అవకాశం ఉన్నా యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత, ప్లేస్ మెంటు వంటి అవకాశాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అయిష్టత చూపారనేది స్పష్టంగా తెలుస్తుంది. ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ సీట్ల కోటాకే దిక్కులేదు.. ఇక మేనేజ్‌మెంట్ కోటాలో చేరే వారి సంఖ్య ఎంత ఉండేది అర్థం చేసుకోవచ్చు. తక్కువ విద్యార్థులతో కళాశాలలను నడుపుకోలేక ప్రైవేటు కళాశాలలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

కళాశాలలో భర్తీ అయిన సీట్ల వివరాలు: కర్నూలు అశోక ఇంజనీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటా కింద మొత్తం 720 సీట్లకు గాను 677 భర్తీ అయ్యాయి. ఇంకా 43 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఏఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 528కి గాను 427 సీట్లు భర్తీ కాగా.. 101 మిగిలాయి. అలాగే ఆదోని భీమా ఇంజనీరింగ్ కళాశాలలో 288 సీట్లకు గాను కేవలం 78 సీట్లు భర్తీ అయ్యాయి. కర్నూలు బృందావన్ ఇంజనీరింగ్ కళా శాలలో 336 సీట్లకు గాను 103 సీట్లు భర్తీ అయ్యాయి. జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 912 సీట్లకు గాను 898 భర్తీ అయ్యాయి. ఎమ్మిగనూరు సెయింట్ జోన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 528 సీట్లకు గాను 378 భర్తీ కాగా, 150 సీట్లు భర్తీ కాలేదు. కర్నూలు కేవీఎస్‌ఆర్ కళా శాలలో 624 సీట్లకు గాను 579 భర్తీ కాగా, ఇంకా 45 మిగిలి ఉన్నాయి. కర్నూలు జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 672 సీటకు గాను 656 భర్తీ అయ్యాయి. రవీంద్ర మహిళా కళాశాలలో 336 సీట్లకు గాను 331 సీట్లు భర్తీ అయ్యాయి. నంద్యాల ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో 1296 సీట్లు ఉండగా.. 1229 భర్తీ అయ్యాయి. కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో 396 సీట్లుకు గాను 283 భర్తీ అయ్యాయి. 113 ఖాళీ ఉన్నాయి. నంద్యాల శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో 528 సీట్లకు గాను 520 సీట్లు భర్తీ కాగా, 8 ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది జరిగిన ఇంజనీరింగ్ కళాశాలల ప్రవేశాల్లో ఉమ్మడి జిల్లాలో ఒక కళాశాలలో కూడా వంద శాతం ప్రవేశాలు జరగలేదు.

కార్యకర్తల ప్రయోజనాలకు పెద్దపీట



సభ్యత్వ నమోదు యాప్‌ను అవిష్కరిస్తున్న పార్టీ ప్రతినిధులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 18: ఇటీవలి ఎన్నికల్లో ప్రజాతీర్పు తమకు రెట్టింపు ఉత్సాహాన్నిచ్చిందని, ఆ స్ఫూర్తితో క్రియాశీల సభ్యత్వ నమోదును మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త చింతా సురేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈసారి సభ్యత్వ నమోదు, గతానికి భిన్నంగా నిర్వహిస్తున్నమని అన్నారు. క్రియాశీల సభ్యులు ప్రమాదవ శాత్తు గాయపడినా, మృతి చెందినా.. వారి కుటుంబానికి ఆర్థికంగా ఆసరా అందిస్తామని అన్నారు. ఈ నెల 22 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన ప్రతినిధులు మంజునాథ్, బజారి, సుమలత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- జనసేన పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ ఆధ్వర్యంలో స్థానిక దర్గాచౌక్ వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా సభ్యత్వ నమోదుకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు.
- స్థానిక వెంకటరమణ కాలనీలో పార్టీ రాయలసీమ జోనల్ ఎన్నికల కన్వీనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

వైసీపీ నాయకుల రౌడీయిజం

- పోలీస్‌స్టేషన్ ముందే టీడీపీ కార్యకర్తపై రాళ్లతో దాడి
- ఇరువురిపై కేసు నమోదు



పోలీస్‌స్టేషన్‌ముందు టీడీపీ కార్యకర్తపై రాళ్లతో దాడి చేస్తున్న వైసీపీ నాయకులు



చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త

ఆదోని రూరల్, జూలై 18 : ఏ ప్రభుత్వం ఉన్నా తమ తీరు ఇంతే అన్నట్లు వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ వద్దే టీడీపీ కార్యకర్తపై రాళ్లతో మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన ఆదోని తాలుక పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం జరిగింది. ఆదోని మండలం సలకలకొండ గ్రామంలో గురువారం టీడీపీ కార్యకర్తలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నాయకులు విజయ్, రాముడు, మల్లేష్, మల్లికార్జునల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకొంది. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కెళ్లమని చెప్పారు. తాలుక పోలీస్‌స్టేషన్ వద్దకు ఇరుపార్టీలకు చెందిన వారు వెళ్లారు. అక్కడ వైసీపీకి చెందిన విజయ్, రాముడు, మల్లేష్, మల్లికార్జున పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న రాళ్లు తీసుకొని టీడీపీ కార్యకర్త శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలపై దాడి చేసి పిడిగుద్దులు గుద్దారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో అక్కడే ఉన్న కానిస్టేబుల్ వచ్చి విడిపించే ప్రయత్నం చేశారు. అయినా వైసీపీ నాయకులు వెనక్కి తగ్గకుండా రౌడీయిజాన్ని ప్రదర్శించారు. తీవ్రంగా గాయపడ్డ టీడీపీ కార్యకర్తను ఆసుపత్రికి తరలించారు. తమను కులం పేరుతో దూషించడంతోపాటు తమపై టీడీపీ వారు దాడి చేశారని వైసీపీ నాయకులు, తమను పోలీస్ స్టేషన్ వద్దే రాళ్లతో వైసీపీ నాయకులు దాడి చేశారని టీడీపీ కార్యకర్తలు తాలుక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నీరంజన్ రెడ్డి తెలిపారు.

శ్రీశైలం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలం, జూలై 18: శ్రీశైలం దేవస్థానంలో గురువారం 53 మంది శాశ్వత, ఒప్పంద, పొరుగుసేవల సిబ్బందిని బదిలీ చేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ బదిలీలు దేవస్థానంలో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా చేపట్టినట్లు పేర్కొన్నారు. బదిలీల్లో పర్యవేక్షకురాలు కె.గిరిజామణికి ఆలయ విభాగ ఫైళ్లపరిశీలన, కె.శివప్రసాద్‌కు లడ్డూతయారీ విభాగాలను కేటాయించారు. స్థానచలనం పొందిన సిబ్బంది వెంటనే ఉత్తర్వుల ప్రకారం సదరు అధికారులకు కేటాయించిన విధులలో వెంటనే రిపోర్టు చేయాలని ఈవో పెద్దిరాజు ఆదేశించారు.

బనవాసిలో నవోదయ ప్రవేశాలకు దరఖాస్తులు

ఎమ్మిగనూరు, జూలై 18: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి ప్రవేశానికి (2025-26) నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3,4వ తరగతిలో ఉత్తీర్ణత పొంది ఐదో తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులు (కర్నూలు, నంద్యాల జిల్లాలు) మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 01.05.2013నుంచి 31.07.2015 మధ్య జన్మించిన వారే అర్హులన్నారు. సెప్టెంబరు 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వచ్చే ఏడాది జనవరి 25వ తేదీన ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలు నవోదయ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు.

పాముకాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 18: మండలంలోని కడివెళ్ల గ్రామంలో మధుప్రియ(4) అనే చిన్నారి పాముకాటుకు గురై మృతి చెందింది. సంతనాగలాపురం గ్రామానికి చెందిన వీరేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం కడివెళ్ల గ్రామానికి వెళ్లాడు. మొహర్రం వేడుకలను చూసి రాత్రి అదే గ్రామంలోని తమ బంధువుల కొట్టంలో నిద్రించారు. రాత్రి వీరేష్‌తో పాటు తన నాలుగేళ్ల మధుప్రియను పాము కాటు వేసింది. వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే విషమించడంతో చిన్నారి మధుప్రియ మృతి చెందగా వీరేష్ కోలుకున్నాడు.

పెండింగ్ రోడ్లు పూర్తి చేయాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 18: జిల్లాలోని రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్మిస్తున్న పెండింగ్ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో రోడ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1512 కిలో మీటర్ల రోడ్లు విస్తరించి ఉందని, ఇందులో భాగంగా 172 కిలోమీటర్ల ప్యాచ్ వర్క్‌రోడ్ల పనులకు రూ.5.48 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. జిల్లాలో రూ.840 కోట్లతో 94 పనులు జరుగుతున్నట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. ఇందులో 32 పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. 12 పనులు మొదలు కావాల్సి ఉందన్నారు. జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నాబార్డ్ కింద రూ.122 కోట్లతో 26 పనులు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో 6 పనులు పూర్తి కాగా 16 పనులు పురోగతిలో ఉన్నాయని 16 పనులు ప్రారంభదశలో ఉన్నాయని కలెక్టర్‌కు వివరించారు. ప్రధాన మంత్రి గ్రామీణ స్వరాజ్ యోజన కింద రూ.23.63 కోట్లతో 15 పనులు పూర్తయ్యాయని, మరో మూడు పనులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్‌కు వివరించారు. అలాగే 1057 ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు. మంజూరై పెండింగ్‌లో ఉన్న రోడ్డు భవన నిర్మాణాల పనులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం త్వరతిగతిన పూర్తిచేయాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి రూ.50 వేలు ఆర్థిక సాయం

జంప్‌రోప్ క్రీడలో నంద్యాల జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన జంప్‌రోప్ క్రీడాకారుడు రుషి నాగేష్‌కు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని కలెక్టర్ రాజకుమారి అందజేశారు. గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో అందజేశారు. ఈ నెలలో జపాన్ దేశం కావసాకి నగరంలో జరిగే అంతర్జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో రుషినాగేష్ పాల్గొంటున్న సందర్భంగా నంద్యాల జిల్లా క్రీడా ప్రాధికారక సంస్థ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్స్ సంయుక్తంగా రూ.50 వేల చెక్కును అందజేసింది. క్రీడాభివృద్ధి అధికారి రాజు, రుషినాగేష్ తల్లి తండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను కొల్లగొట్టిన ఘనుడు జగన్: ఎమ్మెల్యే

నందికొట్కూరు, జూలై 18: గత ఐదేళ్ల కాలంలో భూదోపిడీ, సహజ వనరులను కొల్లగొట్టిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిగత ప్రయోజనాల కోసం దోచుకోవడం దాచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమి లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కౌన్సిలర్ జాకీర్, టీడీపీ నాయకులు ముర్తుజావళి, పలుచాని మహేశ్వరరెడ్డి, లాయర్ జాకీర్, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

నందికొట్కూరు పట్టణంలో నూతన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భూమి పూజ నిర్వహించారు. గురువారం పట్టణ అధ్యక్షుడు, 29వ వార్డు కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సంతపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. వార్డు ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని, అలాగే ఎస్పీగా ఆది రాజ్ సింగ్ రాణాను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూలై 18: ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో అండర్ 19 రాష్ట్ర స్థాయి ఓపెన్ బాలికల చెస్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రాంభోత్సవానికి డాక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ అధికారి నరసింహరాజు, శాంతినికేతన్ విద్యాసంస్థల ఛైర్మన్ సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రెండు రోజులు పాటు జరిగే చెస్ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనేందుకు వచ్చారని డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఏపీ చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, క్రీడా భారతి ప్రతినిధి సుధాకర్ పాల్గొన్నారు.

'నిందితులను గ్రామం నుంచి బహిష్కరించాలి'

పగిడ్యాల, జూలై 18: మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో అత్యాచారం చేసి హత్య చేసిన బాలిక వాసంతి కుటుంబానికి అండగా ఉంటామని, నిందితులను గ్రామం నుంచి బహిష్కరించాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దార సుధీర్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామానికి చేరుకొని బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ నిందితులకు బెయిల్ రాకుండా చేయాలని, ఇందుకోసం న్యాయవాదులు కేసును వాదించవద్దని కోరారు. వాసంతి తమ్ముడు మహేష్ పదో తరగతి వరకు నందికొట్కూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివించే బాధ్యత తాను తీసుకుంటున్నానని తెలిపారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, చంద్రారెడ్డి, నాగశేనరెడ్డి తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నాయకులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఫిరోజ్ తదితరులు

నంద్యాల (కల్చరల్), జూలై 18: టీడీపీ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, పట్టణ టీడీపీ నాయకులు గురువారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నంద్యాల నియోజకవర్గంలోని పలు విషయాలను జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. టీడీపీ పట్టణ నాయకులు మునియార్ ఖలీల్, రాజేశ్వర్ రెడ్డి,షాకీర్, అలీ, సర్దార్ తదితరులు ఉన్నారు.

'ఐకమత్యంగా సాగు చేసుకుందాం'

జూపాడుబంగ్లా, జూలై 18: జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం కింద పొలాలున్న రైతులందరం ఐకమత్యంగా సాగు చేసుకుందామని మండల తెలుగు రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు సూచించారు. జూపాడుబంగ్లా-2 ఎత్తిపోతల పథకం కింద పారుమంచాల, తంగడంచ గ్రామ రైతులు పారుమంచాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోటార్ల మరమ్మతులు చేసేందుకు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని, కలెక్టర్‌ను కలిసి సమస్య పరిష్కరించుకుందామని చెప్పారు. అనంతరం ఎత్తిపోతల పథకం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు గిరీశ్వరరెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: పీడీఎస్‌యూ

నంద్యాల (నూనెపల్లె), జూలై 18: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు షాహీద్, జిల్లా సహాయ కార్యదర్శి బాలాజి ప్రభుత్వాని కోరారు. గురువారం నంద్యాలలోని పద్మావతి నగర్‌సెంటర్‌లో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు ధర్నా చేపట్టారు. నవీన్, ధను, న్యాయమతుల్లా, హరి, తదిరతులు పాల్గొన్నారు.







ముందస్తు మాండ్ర జన్మదిన వేడుకలు


మాండ్రకు కేక్ తినిపిస్తున్న నాయకుడు

నందికొట్కూరు, జూలై 18: టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకరవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి జన్మదిన ముందస్తు వేడుకలను టీడీపీ నాయకుల సమక్షంలో హైదరాబాదులో నిర్వహించుకున్నారు. ఈనెల 19న మాండ్ర శివానందరెడ్డి జన్మదిన వేడుకలు కావడంతో టీడీపీ ముస్లీం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షకీల్ ఆహ్మద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాండ్ర కార్యాలయంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు శాంతరాజు, రసూల్ ఖాన్, బబ్లూ, తదితరులు పాల్గొన్నారు. అలాగే నందికొట్కూరులో వృద్ధులకు అన్నదానం చేశారు. డా.వనజ, శ్రీను పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల అందజేత

పాములపాడు, జూలై 18: మండలంలోని ఇస్కాల గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటీలను టీడీపీ నాయకులు గురువారం సచివాలయ సిబ్బందికి అందించారు. గ్రామంలోని టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి, కలీముల్లా, ఏరువ నాగేశ్వరరెడ్డి శ్రీనివాసులు, శివ తిక్కస్వామి, స్వామన్న నాయకులు చిత్రపటాలకు క్షీరాభి షేకం నిర్వహించి సచివాలయ సిబ్బందికి అందించారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 18: ఆత్మకూరుకు చెందిన నాయినేని మోహన్, నాయినేని అశోక్, సుబ్బ రాజు గురువారం మెట్ల మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్లి వేంకటేశ్వర స్వామికి మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో పాటు ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖరరెడ్డి గెలవడంతో మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.

అటాచ్డ్ సీఐగా బీఆర్ కృష్ణయ్య

నందికొట్కూరు, జూలై 18: నందికొట్కూరు రూరల్ అటాచ్డ్ సీఐగా బీఆర్ కృష్ణయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ముచ్చుమర్రి వాసంతి హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విజయ భాస్కర్‌పై సస్పెన్షన్ వేటు పడడంతో ప్రస్తుతం ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో తదుపరి సీఐ వచ్చేంత వరకు వీఆర్‌లో ఉన్న కృష్ణయ్యను అటాచ్డ్ సీఐగా నియమిస్తూ డిఐజీ విజయారావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

'దళితులపై దాడులను సహించం'

మిడుతూరు, జూలై 18: దళితులపై దాడులను సహించేది లేదని నియోజకవర్గ ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సుంకేసుల గ్రామంలో దళిత యువకుడు మాల దేవరాజుపై అగ్రవర్ణాలకు చెందిన వైసీపీ నాయకుడు భరత్ కుమార్ శర్మ, అతడి అనుచరులు ఇంటికి పిలిపించుకుని కిరాతంగా చిత్రహింసలు పెట్టి అతడిపై దాడి చేయడం దారుణమన్నారు. గురువారం మిడుతూరు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్, ఎమ్మార్పీఎస్ రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, ఇనాయతుల్లా, ఎలీషా, పుల్లన్న పాల్గొన్నారు.

'జర్నలిస్టులపై అసభ్యకర పదజాలం సిగ్గుచేటు'

ఆత్మకూరు, జూలై 18: జర్నలిస్టులపై ఎంపీ విజయసాయిరెడ్డి అసభ్యకరమైన పదజాలాన్ని ప్రయోగించడం సిగ్గుచేటని బీజేపీ, సీపీఎం, సీపీఐ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు గరుడాద్రి సుదర్శన్, రణధీర్, ప్రతాప్, రామకృష్ణ, శ్రీరాములు అన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి ఇటీవల జర్నలిస్టులపై చేసిన దురుసు వ్యాక్యలను ఖండిస్తూ ఆత్మకూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు.

'బాలికా సంరక్షణ అందరి బాధ్యత'


బ్రాహ్మణకొట్కూరులో బాలసభ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

నందికొట్కూరు రూరల్, జూలై 18: నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరులోని 3, 5 అంగనవాడీ కేంద్రాల్లో బాలికల సంరక్షణ గురించి మహిళలకు అవగాహన కల్పించడానికి బాలసభ నిర్వహించారు. సూపర్‌వైజర్ అనూరాధమ్మ, మహిళా పోలీసు కళ్యాణి, ఎంఎల్‌హెచ్ విజయరాణి మాట్లాడుతూ సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 'భేటీ బచావో, భేటీ పడావో' గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, సత్యమ్మ, లక్ష్మీదేవి, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

'హెల్మెట్ ధరించడం శ్రేయస్కరం'

ఆత్మకూరు, జూలై 18: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం శ్రేయస్కరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, న్యాయవాదులు మాణిక్యాలరావు, బతుకులయ్య, హుసేన్‌మియా, మహెబూబ్‌బాషా, భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి న్యాయవాదులు హెల్మెట్ ప్రయోజనాలపై ర్యాలీ నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు రామచంద్రారెడ్డి, సోమన్న ఉన్నారు.

డీపీవో పర్యటన

బండిఆత్మకూరు, జూలై 18: పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో డీపీవో మంజులవాణి బండిఆత్మకూరులో పర్యటించారు. గురువారం కలెక్టర్ బండిఆత్మకూరులో ఆకస్మిక తనిఖీలు చేశారు. వీధుల్లో, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ మండిపడ్డారు. డీపీవోకు వెంటనే ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో హుటాహుటిన డీపీవో మంజులవాణి అక్కడికి చేరుకుని పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని అధికారులను హెచ్చరించారు. ట్యాంక్‌లను క్లీనింగ్ చేయించాలని పీఎస్‌లు నటరాజ్, శ్రీకాంత్‌కు సూచించారు.

'వ్యాధులు సోకకుండా చర్యలు చేపట్టాలి'

మహానంది, జూలై 18: సీజన్ వ్యాధులు సోకకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షురాలు యశస్విని సూచించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ చిరుతపులిని బంధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- ఎం.తిమ్మాపురంలో ఏవో నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ యశస్విని చేతుల మీదుగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అధికారులు పంపిణీ చేయించారు.

కాలువలో పడ్డ దుప్పి

మహానంది, జూలై 18: గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాలువలో గురువారం నల్లమల అడవి నుంచి వచ్చిన దుప్పి ప్రమాదవశాత్తు జారి పడింది. డీఆర్వో హైమవతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రతాప్ అక్కడికి చేరుకున్నారు. కాలికి తీవ్రంగా గాయం కావడంతో దుప్పిని తిమ్మా పురం పశువైద్యశాలకు తరలించారు. పశు వైద్యాధికారి కరుణాకర్ గాయపడ్డ దుప్పికి చికిత్స నిర్వహించారు. అనంతరం మహానంది అటవీ పర్యావరణ విద్యాకేంద్రానికి తరలించారు. కోలుకొన్నాక దుప్పిని నల్లమలలో వదులుతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.











సాయిబాబాకు విశేష పూజలు

చాగలమర్రి, జూలై 18: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం సాయిబాబాకు వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేశారు. జల, క్షీరాభిషేకాలు, ప్రత్యేక హారతులు చేశారు. మహిళలు సామూహికంగా సాయి వ్రతం నిర్వహించారు. అనంతరం పల్లకిలో సాయి చిత్రపటాలను కొలువుదీర్చి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. 21న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుబ్బారావు, నాగభూషణం పేర్కొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డు తప్పనిసరి

చాగలమర్రి, జూలై 18: గ్రామాల్లో కౌలు రైతులు సీసీఆర్సీ కార్డు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ వెంకటరమణమ్మ పేర్కొన్నారు. గురువారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు రైతు గుర్తింపు కార్డు ప్రయోజనాలు, వాటిని తీసుకునేందుకు కావాల్సిన అర్హత పత్రాల గురించి వివరించారు. కౌలు రైతులు తమ ఆధార్‌తో పాటు భూ యజమాని పట్టా దారు పాసు పుస్తకం,ఆధార్‌కార్డు ప్రతులతో వీఆర్వోను సంప్రదిస్తే కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తారని అన్నారు. 17 గ్రామ సచివాలయాల పరిధిలో రైతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో రంగ నేతాజీ, డీటీ శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కౌలు గుర్తింపు కార్డులతో కౌలు రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి పేర్కొన్నారు. గురువారం బి.తాడిపత్రి, నాగిశెట్టిపల్లె గ్రామాల్లో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. మండలానికి కౌలు కార్డులు 250 మంజూరైనట్లు ఏవో వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, వీహెచ్‌ఏ స్నేహలత, సునియా, వీఆర్‌వో రవి, రైతులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

డోన్(రూరల్), జూలై 18: ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ నాయుడు జనసేన నాయకులు మౌలాలి, షబ్బీర్, వీరయ్య, పుల్లయ్య, పీఎస్‌పీకే ప్రసాద్, చరణ్, ఆర్‌సీ ప్యాపిలి నాయకులు మధు నాయుడు, చంద్ర, సునీల్, రమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని ఆళ్లగడ్డ పార్టీ ఇన్‌చార్జీ మల్లయ్య చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరాములు, ఆంజనేయులు, శివ, జగదీష్, శీను పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి..

పరామర్శించిన టీడీపీ నాయకులు



గాయపడ్డ ఎన్.ప్రకాష్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూలై 18: చాగలమర్రి గ్రామంలోని కొత్త ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త ఎన్.ప్రకాష్‌పై గడ్డ కిషోర్, మరి కొందరు దాడి చేసి గాయపరిచారని బాధితుడు గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ఇంటి వద్ద నిలిచి ఉండగా పాత కక్షలు మనసులో పెట్టుకొని గడ్డ కిషోర్, మరి కొందరు ఇంటిపైకి వచ్చి దాడి చేశారని, చంపుతానని బెదిరించారని బాధితుడు పేర్కొన్నారు. గాయపడ్డ ఎన్.ప్రకాష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు వైద్యశాలకు వెళ్లి బాధితుడు ప్రకాష్‌ను పరామర్శించి జరిగిన దాడి సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట టీడీపీ నాయకులు జోసఫ్, ఓబులేసు ఉన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ రమణయ్య మాట్లాడుతూ ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుకు పెట్టుబడి సాయం అందజేయాలి

బేతంచెర్ల, జూలై 18: రైతుకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామన్న ఎన్నికల హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. గురువారం మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సచివాలయం కార్యదర్శి యు.కృష్ణమూర్తి, వ్యవసాయ సహాయ కార్యదర్శి యశోధ, వీఆర్వో కృష్ణకుమారి, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కార్మికులు కలిసి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, రైతు సంఘం మండల అధ్యక్షులు నీలి వెంకటకృష్ణారెడ్డి (కిష్టన్న) మాట్లాడుతూ రూ.2లక్షల వరకు రైతులు, కౌలు రైతులకు అన్ని రకాల బ్యాంకులలో రుణాలు మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో దారం పుల్లారెడ్డి, వెంకటసుబ్బయ్య, వై.ఈశ్వర రెడ్డి, పీరం సాహెబ్, తిరుపతిరెడ్డి, అరిగెల శేఖర్, బాలగయన్న, టీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

దొర్నిపాడు, జూలై 18: మండలంలోని దొర్నిపాడు మండలపరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో కార్యదర్శులకు సూచించారు. విద్యుత్ ఏఈ రామ్మోహన్ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల కొరకు కొత్త యాప్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ యాప్ ద్వార బిల్లులు సులభంగా చెల్లించవచ్చని అన్నారు. ఉప సర్పంచ్ బాల సుబ్బయ్య మాట్లాడుతూ దొర్నిపాడు నుంచి హరివరం వెళ్లే రహదారికి మరమ్మతు చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బాబు, వెటర్నరీ వైద్యాధికారి పుల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, వైద్యాధికారులు, హాస్టల్ వార్డెన్ రాముడు, ఆయా శాఖల అధికారులు ప్రసంగించారు. సమావేశంలో జడ్పీటీసీ శకుంతలారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శిరివెళ్ల, జూలై 18: మండలంలోని బోయలకుంట్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు (36) అనే వ్యక్తి విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంజనేయులు గత కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తూ అప్పులు చేశాడు. తెచ్చిన అప్పులు తీర్చే స్థోమత లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుధా లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ గురువారం తెలిపారు.

బస్సును పునరుద్ధరించిన ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, జూలై 18: డోన్ డిపో నుంచి వెల్దుర్తి, రామళ్లకోట, మండ్లవానిపల్లె మీదుగా ఎంబాయి గ్రామానికి బస్సు సర్వీసు పునరుద్ధరించి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గురువారం ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డోన్ బస్సు డిపో మేనేజర్, టీడీపీ నాయకులు మధుసూదన్, రామరాజు, మద్దయ్య పాల్గొన్నారు.



చాగలమర్రిలో జలమయమైన గాంధీసెంటర్ రహదారి



చాగలమర్రిలో జలమయమైన తహసీల్దార్ కార్యాలయం

చాగలమర్రిలో కుండపోత వర్షం

● జలమయమైన రహదారులు ● మొక్కజొన్నకు ఊపిరి పోసిన వర్షం

చాగలమర్రి, జూలై 18: చాగలమర్రి మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు నీటి కుంటలుగా మారాయి. సెయింట్ ఆన్స్ పాఠశాల, పశువైద్యశాల సమీపంలో మురికి కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో విద్యార్థులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. నెల రోజుల నుంచి వర్షం కోసం రైతులు ఎదురు చూశారు. మొక్కజొన్న పంట వాడుముఖం పట్టడంతో ఈ వర్షం జీవం పోసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్యాపిలి మండలంలో భారీ వర్షం

ప్యాపిలి, జూలై 18: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రామక్రిష్ణాపురం గ్రామంలో నీటి ప్రవాహానికి వంతెన తెగిపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే మండలంలోని బోంచెర్వుపల్లి, రాచెర్ల, నేరేడుచెర్ల, జలదుర్గం, కొమ్మెమర్రి తదితర గ్రామాల్లో కూడ భారీ వర్షం కురిసింది. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



ప్యాపిలి మండలంలోని రామక్రిష్ణాపురంలో తెగిపోయిన వంతెన

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: మంత్రి బీసీ

బనగానపల్లె , జూలై 18 : బనగానపల్లె మండలంలో సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె సమీపంలోని కాపులపల్లెకు వెళ్లే రహదారిలోని బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక గెస్టు హౌస్ వద్ద బనగానపల్లె మండల టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులతో బీసీ సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తల నుంచి ఆయా గ్రామాల సమస్యలకు సంబంధించి వినతిపత్రాలు మంత్రి స్వీకరించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సంబంధించి అన్ని సమస్యలను క్రమంలో పరిష్కరిస్తామన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, కబ్జాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉండి బనగానపల్లె నియోజకవర్గంను అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.



టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో సమావేశమైన రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

వైసీపీ నాయకులు లక్షల ఎకరాలను కాజేశారు

● ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో ప్రజల ఆస్తులకు రక్షణ
● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్, జూలై 18: రాష్ట్రంలో గత ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు లక్షల ఎకరాల భూములను కాజేశారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విమర్శించారు. గురువారం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల భూమిని స్వాహా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల భూకబ్జాలతో ప్రజలు తమ భూములను కాపాడుకునేందుకు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు కాజేసిన భూములు రూ.35వేల కోట్లకు పైగానే ఉంటుందని కోట్ల ఆరోపించారు. జగనన్న కాలనీల పేరుతో 9వేల ఎకరాల భూమిని స్వాహా చేశారన్నారు. గతంలో రాష్ట్ర వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని సహజ వనరులైన గనులను దోపిడీ చేశారన్నారు. ఇసుక దోపిడీలో ప్రజల జేబుల నుంచి రూ.10వేల కోట్లు అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలు, నాయకుల జేబుల్లోకి వెళ్లాయని ధ్వజమెత్తారు. జగనన్న కాలనీల పేరుతో రైతులను బెదిరించి తక్కువ ధరకు భూములను తీసుకుని ఎక్కువ ధరలకు ప్రభుత్వానికి అమ్మి వైసీపీ నాయకులు భారీ ఎత్తున సొమ్ము చేసుకున్నారన్నారు. వైసీపీ కార్యాలయాల కోసం నామమాత్రపు ఫీజులతో రూ.300 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కారుచౌకగా స్వాధీనం చేసుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించారని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు.

ఆళ్లగడ్డ మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దాం : ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూలై 18: ఆళ్లగడ్డ మున్సిపాలిటీని అభివృద్ధికి చిరునామాగా మారుద్దామని ఎమ్మెల్యే అఖిలప్రియ కోరారు. గురువారం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ రామలింగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో రావాలని, వాటిపై కౌన్సిల్ సమావేశంలో తెలపాలని, వాటికి పరిష్కార లభించకపోతే సమస్యల పరిష్కారం కోసం అధికారులతో వాదించాలని సూచించారు. ప్రస్తుత వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి నివారణ కోసం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డులలో మురికి కాలువలు, రోడ్ల నిర్మాణం, వీధిలైట్లు వంటి వాటిని ఏర్పాటు చేసుకునేందుకు మనమంతా కలిసికట్టుగా కృషి చేసుకుందామన్నారు. ముఖ్యంగా పట్టణంలో శానిటేషన్‌పై వార్డులలోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు 10 రోజుల్లోగా ఆయా వార్డుల కౌన్సిలర్లతో, అధికారులతో కలిసి తిరుగుదామన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాల్టి పరిధిలోని ప్రభుత్వ స్థలాలను, కాలువలను ఆక్రమించే వారివివరాలను తన దృష్టికి తీసుకరావాలని కోరారు. శిల్పా వెంచర్ నిర్వాహకులు కేసీ కాలువను ఆక్రమించుకున్నారని, ఈ కాలువను పునరుద్ధరించే వరకు పోరాటం చేస్తామన్నారు. మున్సిపాల్టి దుకాణాలకు 33శాతం పెంచి ఇచ్చే విషయాన్ని ఆలోచించాలన్న కౌన్సిలర్ హుసేన్‌బాషా వినతిపై రాష్ట్ర వ్యాప్తంగా ఇదే శాతం కొనసాగుతున్నదని, దీనిపై ఎమ్మెల్యే, చైర్మన్ కలిసి చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ రమేష్‌బాబు అన్నారు.

● ఆళ్లగడ్డ వారపు సంత మార్కెట్‌లో వ్యాపారులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేద్దామని ఎమ్మెల్యే అఖిలప్రియ కోరారు. గురువారం ఆమె సంత మార్కెట్‌ను మున్సిపాల్టి కమిషనర్, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు.


● ఉమ్మడి కర్నూలు జిల్లాలో అన్ ఎయిడెడ్,ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అఖిలప్రియకు గురువారం చెప్పారు. డిగ్రీ కళాశాలల పరిస్థితిని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం కళాశాలల యజమాన్యాలు ఎమ్మెల్యే అఖిలప్రియను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ అనంత డిగ్రి కళాశాల కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ముగిసిన మొహర్రం


చాలగమర్రి, రుద్రవరం, సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లో మొహర్రం వేడుకలు గురువారంతో ముగిశాయి. గ్రామాల్లో కొలువైన పీర్లను ఊరేగింపుగా ఏటికి తీసుకెళ్లి శుద్ధి చేశారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



చాగలమర్రి మండలం ముత్యాలపాడులో ప్రధాన పీరు లాల్‌స్వామి ఊరేగింపు



రుద్రవరం: ముత్తలూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



సంజామల: ఆకుమల్లలో పీర్ల ఊరేగింపు



కొలిమిగుండ్లలోని పీర్ల వద్ద టీడీపీ నాయకులు

మొహర్రం వేడుకల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఉయ్యాలవాడ, జూలై 18: మండలంలోని రూపనగుడి గ్రామంలో మొహర్రం వేడుకల్లో జరిగిన ఇరు వర్గాల ఘర్షణలో 27 మందిపై కేసులు నమోదయ్యాయి. గ్రామంలో బుధవారం సాయంత్రం పీర్ల ఊరేగింపు జరగుతుండగా ఘర్షణ జరిగింది. పీర్ల ఊరేగింపు గ్రామానికి చెందిన దేశం విశ్వనాథరెడ్డి ఇంటి వద్దకు రాగానే ఆయన ప్రత్యర్థి వర్గీలు గట్టిగా కేకలు వేశారు. దాన్ని ప్రశ్నించినందుకు తన మీద, తన భార్య పద్మ మీద దాడి చేశారని విశ్వనాథరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఫిర్యాదులో దేశం విశ్వనాథరెడ్డి వర్గీయులు పీర్ల ఊరేగింపును అడ్డుకోబోయారని, దీన్ని ప్రశ్నించగా తమ మీద దాడి చేశారని కర్నాటి మహేశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు.

కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే



చాగలమర్రిలో కుష్టువ్యాధి సర్వేను పరిశీలిస్తున్న నోడల్ పర్సన్

చాగలమర్రి, జూలై 18: మండలంలో కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వేను గురువారం 13 సచివాలయాల పరిధిలో ఆశా వర్కర్లు, స్వచ్ఛంద వలంటీర్లచే సర్వే ప్రారంభించినట్లు వైద్యులు ఇమ్రాన్ పేర్కొన్నారు. 2, 10 వార్డులలో జరుగుతున్న ఇంటింటి సర్వేను నోడల్ పర్సన్ రామలింగారెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ 34 టీమ్‌లచే సర్వే చేస్తున్నామని అన్నారు. 783 కుటుంబాలను సర్వే చేయగా 12 అనుమానిత కేసులు గుర్తించామని అన్నారు. ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తామని అన్నారు.

20 అనుమానిత కేసుల పరిశీలన

ఉయ్యాలవాడ, జూలై 18: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 20 అనుమానిత కేసులను పరిశీలిచామని మండల వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలో అనుమానిత కుష్టు వ్యాధి గ్రస్తులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే చేస్తున్నామన్నారు. 20 మంది అనుమానితులను పరీక్ష చేయగా వారిలో కేవలం చర్మ సంబంధ, విటమిన్ల లోపం వల్ల వచ్చిన మచ్చలు మాత్రమే ఉన్నాయని, కుష్టు వ్యాధి కాదని గుర్తించామన్నారు. కార్యక్రమంలో రెండో వైద్యరాలు అపర్ణ, హెల్త్ సిబ్బంది దస్తగిరి,

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలి



డోన్‌లో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్, జూలై 18: డోన్ మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ డా.జయరాం అన్నారు. గురువారం పట్టణంలోని 20వ వార్డులో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. పట్టణంలో ఖాళీ స్థలాలను అలాగే వదిలేయడం వల్ల పిచ్చి మొక్కలను, కంప చెట్లు పెరుగుతున్నాయన్నారు. అలాంటి స్థలాలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి వాటికయ్యే ఖర్చు మొత్తం స్థల యజమానులు భరించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఇంటి నుంచి సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వార్డు శానిటేషన్ సెక్రటరీలను కమిషనర్ జయరాం హెచ్చరించారు.

ఇద్దరి ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

రుద్రవరం, జూలై 18: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, చిన్నకంబలూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి అనే ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేసినట్లు ఏపీవో ప్రతాప్ గురువారం తెలిపారు. ఇద్దరి రాజీనామ నివేదికలను ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆయన తెలిపారు. త్వరలో కొత్తవారిని వారి స్థానాల్లో నియమిస్తామని తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

కోవెలకుంట్ల , జూలై 18: ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రహిమాన్ పేర్కొన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, న్యాయవాదులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మోటారు బైక్‌లపై ప్రయాణం చేసే ఒక్కరు హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. చిన్నపిల్లలు బైక్‌లు నడపరాదన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తిరుపాలు, సెక్రటరీ ఓబులేసు, జాయింట్ సెక్రటరీ శేఖర్, సీనియర్ న్యాయవాదులు మధుసూధన్‌రెడ్డి, తిరుపతయ్య, విష్ణుమనోహర్‌రెడ్డి, నరసింహులు, ఆరికట్ల మల్లిఖార్జునరెడ్డి, బాలమురళీకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని బనగానపల్లె లాయర్ల ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలిలో బైక్‌లు నడిపే వారికి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ గంటా సుబ్బారావు, అజాంహుసేన్, నరసింహారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందార్లు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రాష్ట్ర గొర్రెల పెంపకందార్ల ఫెడరేషన్ చైర్మన్



మాట్లాడుతున్న నాగేశ్వరరావుయాదవ్

ప్యాపిలి, జూలై 18: గొర్రెల పెంపకందార్లు ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర గొర్రెల పెంపకం దార్ల ఫెడరేషన్ చైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని గొర్రెల పెంపకం దార్ల సంఘం భవనంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ గొర్రెల పెంపకందార్ల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రావడంతో వారికి మంచి రోజులు వచ్చాయన్నారు. ఎన్ఎల్ఎం, ఎన్‌సీడీసీ పథకాల అమలుకు నిధులు విడుదలయ్యేలా ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులైన గొర్రెల పెంపకందార్లకు రుణాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రశాంతి, జాహ్నవి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి

బనగానపల్లె , జూలై 18 : బనగానపల్లె పట్టణంలోని ఆస్థానం రోడ్డులో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ద్విచక్ర, ఆటోల వాహన దారులు సహకరించాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు కోరారు. గురువారం ఆస్థానం రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆయన స్వయంగా పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో కలసి ఆస్థానం రోడ్డులో పర్యటించి వాహనదారులకు, వ్యాపార సంస్థ యజమానులకు పలు సూచనలు చేశారు.

పాడి పరిశ్రమ గొర్రెల పెంపకాలపై అవగాహన



అవులదొడ్డి గ్రామంలో ఉచిత పశుగర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాజశేఖర్

డోన్(రూరల్), జూలై 18: డోన్ మండలం అవులదొడ్డి గ్రామంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, గొర్రెల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఉచిత పశుగర్భకోశ వ్యాధుల చికిత్సల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, డోన్ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. 45 పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సలు పశు వైద్యులు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల అవగాహన కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కొయ్యదూడల పుట్టి కార్యక్రమం, కృత్రిమ గర్భధారణ ద్వారా ప్రతి సంవత్సరం రైతులు ఒక దూడ పుట్టే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం 75 శాతం సబ్సిడీతో రైతులకు పశుగ్రాస విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఆవులదొడ్డి గ్రామ మాజీ సర్పంచ్, నియోజకవర్గ జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, డాక్టర్లు మల్లన్న, రాజశేఖర్ రెడ్డి, హరీష్, హుశేన్‌బాషా, భాను తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలి

కొలిమిగుండ్ల, జూలై 18: పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల పట్ల పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోటపాడు గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స కేంద్రం నిర్వహించారు. గ్రామంలోని పలువురు రైతులకు చెందిన పశువులకు డా.పద్మావతి ఉచితంగా టీకాలు వేసి, మందులను పంపిణీ చేశారు.